

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కుమారుడు చిట్టెం పృథ్వీరెడ్డి నిశ్చితార్థాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించగా.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, ఆదివారం 15 డిసెంబర్ 2024 | NAGARKURNOOL


## కాంగ్రెస్‌ను విస్మరిస్తున్న ప్రజలు

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



మాజీ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 14 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు విస్మరిస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హన్వాడ మండలం పెద్దదర్పల్లి బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు చిన్న చెన్నయ్య మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ముందుగా చెన్నయ్యకు మాజీ మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీస్తుంటే వారిపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి మోసపోయమన్న విషయాన్ని ప్రజలు ఆలస్యంగా గుర్తిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకన్న, నాయకులు తేజ, రవి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉడాన్ స్కీం కింద టూ టైర్ పట్టణాల్లో..

కేంద్ర ప్రభుత్వం ఉడాన్ స్కీం కింద రాష్ట్రాల్లో అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో విమానాశ్రయాలు ఏర్పాటు చేసేందుకు ఆయా రాష్ట్రాలకు ప్రతిపాదనలు పంపాలని కోరింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 6 పట్టణాల్లో ఏర్పాటు చేసేందుకు ఎంపిక చేశారు. రాజధానికి సమీపంలో ఉండే అంతర్జాతీయ విమానాశ్రయం రద్దీని తట్టుకునే విధంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందని భావించారు. శంషాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసేందుకు ఎంపిక చేసిన స్థలాలకు కేవలం గంటలోపే చేరుకునే విధంగా వీటిని పరిశీలించారు. అంతేకాకుండా ఇటు ఆంధ్రప్రదేశ్ కూడా దగ్గర వుతుందని ఉద్దేశంతో మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారు. అన్నింటిని సమీకరించి కేంద్రానికి నివేదించారు. ఈ లోపు ఎన్నికలు రావడంతో విమానాశ్రయాలు ఏర్పాటు అటకెక్కింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న విమానాశ్రయాలపై చిన్నచూపు ప్రదర్శిస్తుంది.



అడ్డాకుల మండలం గుడిబండలో విమానాశ్రయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల (ఫైల్)

### రేవంత్‌కు ప్రేమ లేదు..




భూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కార్యక్రమం కూడా చేపట్టలేకపోతున్నది. ఇచ్చిన ఆరు గ్యారెంటీలు కూడా తుంగలోకి తొక్కారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి సీఎంగా అయితే ఎంతో బాగుపడుతుందని సంతోషిస్తే.. ఏడాది తిరగక ముందే అసలు స్వరూపం బయటపడింది. సొంత జిల్లాపై రేవంత్‌రెడ్డికి మమకారం లేదు.. కేవలం ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి అనుభవిస్తున్నారు తప్పా అభివృద్ధి చేయాలని ధ్యాసే లేదు. దీనికి సాక్ష్యం విమానాశ్రయం ఏర్పాటు. కనీసం రెండో విడుతలో సైతం పాలమూరు జిల్లా పేరు పెడితే ప్రజలు హర్షించేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తుంది అనడంలో సందేహం లేదు.

*- ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే*

### దేవరకద్ర నియోజకవర్గంలో ఏవియేషన్ ఆఫీసర్ల సర్వే

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని దేవరకద్ర నియోజకవర్గంలో మూడు మండలాల్లో ఏవియేషన్ అధికారులు సర్వే చేపట్టారు. అడ్డాకుల మండలం గుడిబండ.. దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి.. మూసాపేట మండలం తుంకిని పూర్ గ్రామంలో విమానాశ్రయం కోసం స్థల పరిశీలన చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని విమానాశ్రయానికి అనుకూలంగా ఉన్న భూములను పరిశీలించారు. ఢిల్లీకి చెందిన అధికారులు అడిగిన ప్రతిదానికి జిల్లా అధికారులు దగ్గరుండి సమకూర్చారు.. 2019లో ఈ మూడు చోట్ల రెండు, మూడు సార్లు స్థలాలను పరిశీలించి విమానాశ్రయానికి అనుకూలంగా ఉందని భూసేకరణ కూడా ఇబ్బంది లేదని జిల్లా అధికారులు కూడా ఏవియేషన్ అధికారులకు నివేదికలు ఇచ్చారు. గుడిబండ, తుంకినిపూర్ చౌదర్‌పల్లి గ్రామాలు జాతీయ రహదారికి ఆనుకొని ఉంటాయి. దివిటిపల్లి వద్ద ఐటీ పార్క్ నిర్మాణం.. కొన్ని కిలోమీటర్ల దూరంలోని విమానాశ్రయ నిర్మాణం వల్ల మహబూబ్‌నగర్ జిల్లా మరింత అభివృద్ధిలోకి వస్తుందని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది.




సీఎం సొంత జిల్లాకు మొండిచేయి

# ఎయిర్‌పోర్టు కలేనా?


- వరంగల్‌లో విమానాశ్రయానికి సర్కార్ పచ్చజెండా
- మరో మూడు జిల్లాల్లో ఏర్పాటుకు అడుగులు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరులో ఏర్పాటుకు సిద్ధం
- కాంగ్రెస్ పాలనలో చిన్నచూపు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పారిశ్రామికంగా, ఆర్థికంగా ఎదుగుతున్న పాలమూరు జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు కలగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేపట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాలమూరుకు మొండిచేయి చూపించి వరంగల్ జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. దీంతోపాటు మరో మూడు జిల్లాల్లో ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానాయ శాఖ మంత్రి రామ్మూర్తి నాయుడుకు ఇటీవల మంత్రులు వినతిపత్రం అందజేశారు. ఇందులో పాలమూరు జిల్లా పేరు లేక పోవడంతో జిల్లా ప్రజలు విమర్శలు చేస్తున్నారు. సీఎం సొంత జిల్లా అయినప్పటికీ విమానాశ్రయం ఊసే లేకపోవడంతో జనం పెదవి విరుస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి సొంత జిల్లాపై మమకారం లేదని అభివృద్ధి చేయాలన్న తపన లేదని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డివిమర్శించారు. పాలమూరు ఎయిర్‌పోర్టు ఇక కలేనా అంటూ వివిధ సంఘాలు అంటున్నాయి.

**ఉమ్మడి పాలమూరు జిల్లాకు అన్యాయం**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో చేపట్టడం.. ఉమ్మడి జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో మహబూబ్‌నగర్ జిల్లా రూపురేఖలు మారుతాయని ధీమాతో ఉన్నారు. కానీ అందుకు విరుద్ధంగా సీఎం సొంత జిల్లాకే ఎయిర్‌పోర్టు మంజూరు కాకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సొంత జిల్లాలో కాదని ఎక్కడో ఉన్న జిల్లాలో ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం నివేదికలు పంపడంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు జరిగితే ఆర్థికంగా, పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందే అవకాశం లేకపోలేదు. ఇటీవల కేంద్రం మంజూరు చేసిన విమానాశ్రయాల్లో పాలమూరు జిల్లా పేరు లేకపోవడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. తమ ప్రాంతానికి చెందిన సీఎం ఉన్నప్పటికీ విమానాశ్రయం రాకపోవడం.. కనీసం కాంగ్రెస్ సర్కార్ కొత్త ప్రతిపాదనలు పంపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

## నేడు, రేపు గ్రూప్-2 పరీక్షలు



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 14 : రాష్ట్రంలో 783 గ్రూప్-2 సర్వీసుల పోస్టుల భర్తీకి ఈ నెల 15, 16 తేదీల్లో (ఆది, సోమవారాల్లో) పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షల నిర్వహణకు మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాలను జిల్లా అధికారులు సిద్ధం చేశారు. ఈ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబర్ 29న ప్రకటన జారీ చేయగా, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.51లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 20,554 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా, 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు ఉంటాయి.

***బయోమెట్రిక్ తప్పనిసరి..***

అభ్యర్థులు బయో మెట్రిక్ తప్పనిసరిగా వేయాలని, లేదంటే ఓంఆర్ పత్రాలు మూల్యాంకనం చేయబోమని టీజీపీఎస్సీ పేర్కొంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు తెలిపారు.

***నిమిషం నిబంధన అమలు..***

జిల్లాలో మొత్తం 20,554 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు 54 పరీక్ష కేంద్రాలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మొదటి సెషన్ కోసం ఉదయం 8:30నుంచి, మధ్యాహ్నం సెషన్‌కు 1:30గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల గేట్లు నిర్దేశిత సమయానికి ఉదయం 9:30గంటలకు, మధ్యాహ్నం 2:30గంటలకు మూసివేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు అరగంట ముందు పరీక్షా కేంద్రాలకు రావాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదన్నారు. అభ్యర్థులు బ్లూ, బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ను, హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు కార్డు తప్పా మరే విధమైన వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకురాకూడదన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పేజర్స్, టాబ్లెట్స్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, గడియారం, గణిత టేబుల్, లాగ్ పట్టికలు, పర్స్, పరీక్ష ప్యాడ్, నోట్ బుక్స్ లేదా విడి పేపర్లు, ఆభరణాలు, హ్యాండ్ బ్యాగులు, పౌచ్‌లు తీసుకురావద్దని సూచించారు.




అద్దె గదుల్లో కొనసాగుతున్న ఫైర్‌స్టేషన్ కార్యాలయం

## సమస్యల వలయంలో ఫైర్ స్టేషన్



ఇటుకలు, బండలపై ఏర్పాటు చేసిన కంప్యూటర్

- నీటి సౌకర్యం లేక తంటాలు
- తాత్కాలిక కార్యాలయ ఏర్పాటుతో ఇక్కట్లు
- ఏడాదిగా ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- పట్టించుకోని ప్రభుత్వం

అలంపూర్,డిసెంబర్ 14 : అలంపూర్ నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన ఫైర్‌స్టేషన్ సమస్యల వలయంలో చిక్కుకున్నది. అక్కడ విధులు నిర్వర్తించలేమని సిబ్బంది పడుతున్న గోస వర్ణనాతీతం. గతంలో కేసీఆర్ హయాంలో అగ్ని ప్రమాదాల తక్షణ నివారణ కోసం అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా నియోజకవర్గానికో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. గతేడాది అక్టోబర్ 6వ తేదీన అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డులో అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు తాత్కాలికంగా ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. ప్రభుత్వం మారినా పరిస్థితులు మారలేదు. స్టేషన్ హౌస్ ఇన్‌చార్జి కురుమూర్తితో పాటు 13మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఇద్దరు డిప్యుటేషన్‌లో ఉన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ ఇంజిన్‌లో నీటిని నింపుకోవడానికి కూడా అవకాశం లేక పోగా కనీసం సిబ్బంది కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా తగిన నీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు లేక సిబ్బంది మార్కెట్ యార్డులోని ముళ్ల పొదల్లోకి వెళ్లే పరిస్థితి దాపురించింది. అదేవిధుగా కాలం చెల్లిన ఫైర్ ఇంజిన్‌కు మరమ్మతులు నోచుకోక సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఫైర్ ఇంజిన్‌లో నీటిని నింపుకోవడానికి కూడా నేషనల్ హైవే-44 వారి బోర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యవసాయ మార్కెట్‌లో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ఉన్నప్పటికీ ఫైర్ ఇంజిన్‌కు నీటిని నింపుకొనే సౌకర్యం లేదు. సిబ్బందికి విధులు నిర్వర్తించడానికి సరైన కార్యాలయం లేదు. వ్యాపార సముదాయంలోని ఓపెన్ షెట్టర్లలోనే చలికి కాలం వెల్లదీస్తున్నారు. వర్క్ లేనప్పుడు సిబ్బంది విశాంత్రి తీసుకోవడానికి తగిన ఫర్నీచర్ ,బెడ్లు లేవు. కనీసం కంప్యూటర్ పెట్టుకోవడానికి టేబుల్ కూడా కరువైంది. ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపూ 43అగ్ని ప్రమాదాలను అరికట్టామని స్టేషన్ ఇన్‌చార్జి కురుమూర్తి తెలిపారు. స్టేషన్‌ను లో పరిస్థితులను గమనించి పరిష్కరించాలని కోరుతున్నారు. లేక పోతే అలంపూర్ చౌరస్తాలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన 30 గుంటల భూమిలో కొత్త ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## 25 నుంచి కోయిల్‌సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల



సాగునీటి సలహా మండలి సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 14 : ఈనెల 25వ తేదీ నుంచి వారబందీ పద్ధతిలో కోయిల్‌సాగర్ ఆయకట్టుకు కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో కోయిల్‌సాగర్ సాగునీటి సలహా మండలి సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. యాసంగి 2024-25 సీజన్‌కు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదలకు సాగునీటి సలహా మండలి సభ్యులు, రైతులతో కలిసి చర్చించి తీర్మానం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. వారబందీ పద్ధతిలో ఈ నీటి విడుదల ఏప్రిల్ 15 వరకు కొనసాగుతుందన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటరీ కాల్వల్లో పూడిక తీయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పెండింగ్ పనులపై చర్చించారు. కాల్వల నుంచి అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని వాడుకుంటే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, సాగునీటి ప్రాజెక్టు సీఈ రమణారెడ్డి, ఎస్‌ఈ చక్రధర్, కోయిల్‌సాగర్ ఈఈ ప్రతాప్‌సింగ్, మిషన్ భగీరథ ఈఈ వెంకటరెడ్డి, సాగునీటి, వ్యవసాయ, మిషన్ భగీరథ శాఖల అధికారులు, సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఘర్షణ

- ఒకరిపై మరొకరు ఆరోపణలు

గద్వాల అర్బన్, డిసెంబర్ 14 : ఇద్దరు కాంగ్రెస్ నాయకులు ఘర్షణ పడిన ఘటన శుక్రవారం జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో చోటు చేసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలోకి ఎలా చేరుతారు ? ఇన్నాళ్లు పార్టీని కష్టపడి మేము కాపాడుకుంటూ వచ్చామంటూ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వర్గానికి చెందిన ఓ నాయకుడు ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఓ నాయకుడిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసినట్లు తెలిసింది. పార్టీ అధికారంలోకి వచ్చి తర్వాత మా పార్టీలోకి ఎలా వస్తారంటూ అసభ్య పదజాలంతో దూషించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి తనతో రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి అసభ్యంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ శుక్రవారం రాత్రి గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్ కుమార్‌కు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేశాడు. అనంతరం మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్ రెడ్డి శనివారం వెంకటేశ్వర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## రెగ్యులర్ చేసే వరకు పోరాటం చేస్తాం

- బతుకమ్మ ఆడి నిరసన తెలిపిన ఉద్యోగులు





బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్, డిసెంబర్ 14 : రెగ్యులర్ చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగులు స్పష్టం చేశారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు వెనుకడుగు వేయబోమని చెప్పారు. జిల్లా కేంద్రంలోని స్మృతి వనం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. సమ్మెలో భాగంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్న తమని ప్రభుత్వం విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధితో పోలిస్తే మా వేతనాలు చాలా తక్కువని చెప్పారు. ఉద్యోగ భద్రత లేకపోయిన విధులు నిర్వహిస్తున్న తమని రెగ్యులర్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉసేనప్ప, ప్రధానకార్యదర్శి గోపాల్, మహిళా అధ్యక్షురాలు ప్రణీత, రామాంజనేయులు, శ్రీనివాసులు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- అలంపూర్ఎమ్మెల్యే విజయుడు



విద్యార్థినికి దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 14 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ప్రతి మండలంలో ఏర్పాటు చేశారన్నారు. గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని చదువుకోవాలని, లక్ష్యం చేరే వరకు శ్రమించాలన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని క్రీడల వల్ల కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని, క్రీడల వల్ల దేశానికి కీర్తి, ప్రతిష్టలు తీసుకురావచ్చని పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలలో ఏ సమస్య ఉన్నా విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాల, కళాశాలలో తరగతి గదులను, వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసి క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రఘురెడ్డి, వేణు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వట్టెం టన్నెల్‌లో గోడ కూలి డ్రైవర్‌కు గాయాలు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 14: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉయ్యాలవాడ-వట్టెం మధ్యలో శనివారం ప్రమాదం చోటు చేసుకొని డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పనులు చేస్తున్న క్రమంలో కాంక్రీట్ మిక్చర్ వాహనం టైరు పగిలి టన్నెల్ గోడకు ఢీకొట్టింది. దీంతో మిక్సర్ వాహనం ఓ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు.